# అప్పుడు పనులు చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా..?

- ప్రతిపక్షాలవి ఝూటా మాటలు
- కర్ణాటక ప్రజలను ముంచినట్టే మనల్ని మోసం చేస్తరు
- బీఆర్ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి
- కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



**కోరుట్ల: బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల**

మెట్‌పల్లి/కోరుట్ల, నవంబర్ 1: 'ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ప్రతిపక్షాలు ఆగమాగమవుతున్నయి. ఏం చేయాలో తెలియక ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నయి. ఇది చేస్తం.. అది చేస్తమని ఆచరణ సాధ్యంకాని హామీలు ఇస్తున్నయి. మరి రాష్ట్రాన్ని ఏండ్లకేండ్లు పాలించినపుడు ఇవన్నీ ఎందుకు చేయలేదు? ప్రజల కష్టాలు తీర్చలేదెందుకు..? అప్పుడు చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా..? వాళ్లవన్నీ ఝూటా మాటలే. హామీలన్నీ నీటిమూటలే. ఏ ఒక్కటీ అమలు చేయరు. కర్ణాటక ప్రజలను అట్లనే ముంచిన్రు. నేనొక్కటే చెబుతున్నా. వాళ్ల మాటలు నమ్మితే మనం కూడా మోసపోతం. గోసపడుతం' అని కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనతోనే రాష్ట్ర సుభిక్షంగా ఉంటుందని, సమగ్రాభివృద్ధి, సంక్షేమం జరుగుతుందన్నారు. తెలంగాణ రాక ముందు వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి మధ్య తేడా గమనించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని, నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. బుధవారం మెట్‌పల్లి పట్టణంలోని 12వ వార్డుల్లో ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, దీన్ దయాల్ నగర్, ఇందిర ప్రియదర్శిని కాలనీకి చెందిన మహిళలు, యువకులు సంజయ్ కల్వకుంట్లకు అపూర్వ స్వాగతం పలికారు. కాగా, తమ కాలనీకి వచ్చిన సంజయ్ కల్వకుంట్లకు మద్దతుగా పలువురు యువకులు జైకొట్టారు. బీఆర్ఎస్‌లో చేరగా, వారికి సంజయ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ బీ చంద్రశేఖర్‌రావు, నాయకులు రవికాంత్, వెంకటేశ్, జావీద్ పాల్గొన్నారు.



**కోరుట్ల: ఆటో యూనియన్ నాయకుడిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే**

### కోరుట్లలో వలసల జోరు

కోరుట్లలో చేరికల జోరు కొనసాగుతున్నది. బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సమక్షంలో సుమారు 200 మంది యువకులు, ఆటో యూనియన్ సంఘం నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి సంజయ్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు బీఆర్ఎస్ పార్టీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ గెలుపుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఫహీమ్, కౌన్సిలర్లు సజ్జు, జిందం లక్ష్మీనారాయణ, నాయకులు బాబా, ఆటో యూనియన్ నాయకులున్నారు.

# ఎంపీ అర్వింద్‌తో పైసా పాయిదా ఉన్నదా..?



**జగిత్యాల జిల్లా కేంద్రంలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్**

- ఆయనకు పని చేతకాదు.. మర్యాద అసలే తెల్వదు
- ప్రెస్‌మీట్లు పెట్టి వాళ్లను.. వీళ్లను తిట్టుడు తప్ప ఏమైనా చేసిండా..?
- ఇప్పటికైనా మేల్కోండి
- జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, నవంబర్ 1: 'బడాయి మాటలు మాట్లాడే ఎంపీ అర్వింద్ తన పార్లమెంట్ పరిధిలోని ప్రజలను మోసం చేసిండు. పైసా అభివృద్ధి చేయలే. ఆయనకు పనిచేతకాదు.. అసలు మర్యాదనే తెలువదు. ప్రెస్‌మీట్లు పెట్టి వాళ్లను.. వీళ్లను తిట్టుడు.. పోవుడు తప్ప ఏమైనా చేసిండా.. గెలిచిన తర్వాత ఒక్క గ్రామాన్నైనా సందర్శించిండా..? ఆయన మాటలు ఇంకా నమ్ముతారా..? మేల్కోండి' అంటూ జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ ప్రజలకు సూచించారు. ఇప్పుడు ఆయన కొత్త ట్రెండ్ తెచ్చాడని, నిజామాబాద్ నుంచి ఆయన డైరెక్షన్ చేస్తే ఇక్కడ యాక్షన్ నడుస్తున్నదని మండిపడ్డారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని 39వ వార్డులో తన సతీమణి రాధికతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగిత్యాల పట్టణంలో బీట్ బజార్‌లో అత్యాధునిక హంగులతో సమీకృత నాన్‌వెజ్ మార్కెట్‌ను నిర్మించి రైతులు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. బీట్ బజార్‌లో ఏరియాలో 328 మందికి ఇప్పటిదాకా పింఛన్ల రూపంలో రూ.5కోట్ల సాయం చేశామని, బీడీ కార్మికులకు సైతం రూ.5 కోట్ల జీవనభృతి అందించినట్లు వివరించారు. అలాగే 100 మందికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చామని, రాని వారికి త్వరలోనే ఇండ్లు ఇస్తామన్నారు. ఇంకా 61 మందికి కల్యాణ లక్ష్మి పథకాన్ని వర్తింపజేశామని చెప్పారు. మూడోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5లక్షల బీమా కల్పిస్తామని, మధ్యాహ్న భోజనం మాదిరిగానే ఇంటింటికీ రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందజేస్తామని స్పష్టం చేశారు. జగిత్యాల చుట్టూ ఉన్న ప్రతి చెరువును అభివృద్ధి చేశామని, ప్రధాన రహదార్లపై డివైడర్లు కట్టించి సెంట్రల్ లైటింగ్ అమర్చినట్లు చెప్పారు. ఎల్ఎల్ గార్డెన్ నుంచి ధన్వంతరి ఆలయానికి వెళ్లే దారికి నిధులు కేటాయించామని, త్వరలోనే రోడ్డు పూర్తవుతుందన్నారు. తనను నమ్మి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయలేదని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని, ముఖ్యంగా జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. మరోసారి దీవించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని వివరించారు. ప్రచార కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సమిండ్ల వాణి తదితరులు పాల్గొన్నారు.



**జగిత్యాల జిల్లా కేంద్రంలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ సతీమణి రాధిక**

# కాపాడే కేసీఆర్ కావాలో.. సున్నం పెట్టే కాంగ్రెస్ కావాలో..

- ప్రజలారా మీరే ఆలోచించండి
- కాంగ్రెస్, బీజేపీని నమ్మితే అరిగోసే
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- గంగాధర మండలంలో ఇంటింటా ప్రచారం



**మల్లాపూర్‌లో ర్యాలీగా వస్తున్న చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

గంగాధర, నవంబర్ 1 : తెలంగాణ ప్రజలను కడుపులో పెట్టుకొని కాపాడుకునే కేసీఆర్ కావాలో..? అబద్ధపు హామీలతో సున్నం పెట్టే కాంగ్రెస్ కాంగ్రెస్, బీజేపీలో కావాలో..? ప్రజలారా మీరే ఆలోచించాలని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే కర్ణాటక రైతుల మాదిరిగా అరిగోస పడుతామని, అర్ధ రాత్రి సమయంలో పొలం కాడికి పోవడానికి టార్చిలైట్లు కొనుక్కోవాల్సిన దుస్థితి వస్తుందన్నారు. రైతుబంధు వద్దని, మూడు గంటల కరెంట్ చాలని చెప్పే కాంగ్రెస్‌తో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే సీఎం కేసీఆర్‌ను మరచిపోవద్దని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. గంగాధర మండలంలోని తాడిజెర్రి, రంగరావుపల్లి, గోపాల్‌రావుపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ ప్రచారం చేశారు. ఆయాగ్రామాల్లో ర్యాలీ తీసి గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. ఆయాచోట్ల సుంకె రవిశంకర్ మాట్లాడారు. కాంగ్రెస్‌ది కుర్చీలాట అని, బీజేపీది మత రాజకీయమని, బీఆర్ఎస్‌ది ప్రజా సంక్షేమమని పేర్కొన్నారు. ₹1800 కోట్లతో చొప్పదండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, పల్లెలను మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ జోరుకు ప్రతిపక్షాలు బేజారవుతున్నాయని ఎద్దేవా చేశారు. ఐదు గ్యారెంటీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా చేతులెత్తేసిందని విమర్శించారు. కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధును బంద్ చేయాలని ఈసీకి లేఖ రాశాడని దుయ్యబట్టారు. 'జన్ ధన్ ఖాతా కోలో.. హమ్ ధన్‌ధన్ పంద్రా లాక్ దాలేంగే' అన్న ప్రధాని మోదీ 15 పైసలు కూడా జమచేయలేదని ఎద్దేవా చేశారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో వచ్చి అబద్ధపు ప్రచారాలు చేసే వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధానర్సయ్య, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ పుల్కం గంగన్న, వైస్ ఎంపీపీ కంకణాల రాజ్‌గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు రామిడి కనకమ్మ, పాశం స్వప్నకుమార్, రాసూరి మల్లేశం, ఆకుల శంకరయ్య, కంకణాల విజేందర్‌రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్ ఉన్నారు.

# కొడిమ్యాలలో బీఆర్ఎస్ జోరు



**కొడిమ్యాలలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ స్వర్ణలత, జడ్పీటీసీ ప్రశాంతి, ఎమ్మెల్యే రవిశంకర్ సతీమణి దీవెన**

కొడిమ్యాల మండలంలో బీఆర్ఎస్ జోరుమీదున్నది. ఊరూరా ప్రచారంలో దూసుకెళ్తున్నది. బుధవారం ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, ఎమ్మెల్యే రవిశంకర్ సతీమణి దీవెన, ఎమ్మెల్యే కొడుకు దీక్షిత్, కొడిమ్యాల సర్పంచ్ ఏలేటి మమత కొడిమ్యాలలో విస్తృత ప్రచారం చేశారు. శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ గుట్ట వద్ద నుంచి బస్టాండ్ దాకా ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికలో కారు గుర్తుకు ఓటేసి సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. **- కొడిమ్యాల, నవంబర్ 1**